సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 18 । జూన్ । 2023



ప్రజాస్వామ్య పటిష్టతకు..
ముంబైలో జరిగిన జాతీయ లెజిస్లేచర్స్ సదస్సు ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచే దిశగా సాగిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. 8లో ▸



ఉద్యోగుల సంక్షేమానికి కృషి
ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పంచాయతీరాజ్ ఉద్యోగులు ఆమెను సత్కరించారు. 8లో ▸



వర్షాలు కురవాలని..
రాష్ట్రంలో వర్షాలు సుభిక్షంగా కురవాలని కోరుతూ ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శనివారం విరాట పర్వ పారాయణం చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

చెక్కు అందజేత


యాసిడ్ దాడి బాధితురాలి కుటుంబానికి చెక్కు అందిస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): యాసిడ్ దాడి బాధితురాలి కుటుంబానికి ఏలూరు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి శనివారం రూ.లక్ష చెక్కు అందజేశారు. ఈనెల 13న ఏలూరులో ఫ్రాన్సికా అనే మహిళపై యాసిడ్ దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో బాధితురాలైన ఫ్రాన్సికాకు మెరుగైన వైద్యం కోసం మణిపాల్ ఆస్పత్రిలో చేర్పించారు. ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి ఫ్రాన్సికా తల్లిదండ్రులకు రూ.లక్ష చెక్కు అందించారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి, డీసీపీఓ సూర్యచక్రవేణి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ నిర్మల పాల్గొన్నారు.

నిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు

తాడేపల్లిగూడెం: ప్రతిభ కల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమని నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. శనివారం ఏపీ నిట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు తొమ్మిది మందికి చౌదరి స్పిన్నర్స్ వారి నార్త్ సౌత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందించారు. విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని రిజిస్ట్రార్ కోరారు. ట్రస్టు ఫౌండర్ చిట్టూరి ప్రసాదచౌదరి మాట్లాడుతూ 2011 నుంచి ట్రస్టు ద్వారా సాయం అందిస్తున్నామని ఈ ఏడాది 94 మంది విద్యార్థులకు రూ.21.73 లక్షలు సాయం చేశామన్నారు. డీన్ అకడమిక్ టి.కురుమయ్య, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి.సందీప్, ఏఓ పి.తపస్ పర్మనీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు


విజేతలతో నిర్వాహకులు

సాక్షి, భీమవరం: పట్టణంలోని అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా చెస్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లాస్థాయి అండర్-9 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ పోటీలు నిర్వహించారు. 26 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో ఎస్.వరుణ్‌శ్రీతేజ, యు.కాశ్యప్‌శ్రీవర్మ, ఈ.దేవాన్ష్, బాలికల విభాగంలో పి.యశ్వత్‌వర్మ, పి.సహస్రవర్మ, జి.మోహిని ప్రియదర్శిని విజేతలుగా నిలిచారని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. వీరు ఈనెల 23 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గమిని పవన్, సంయుక్త కార్యదర్శి ఎం.మురళీమోహన్, పి.రవిప్రసాద్, ప్రతిమ పాల్గొన్నారు.

వృద్ధులకు వరం 'కంటి వెలుగు'

భీమవరం(ప్రకాశం చౌక్): కంటి వెలుగు పథకంలో 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నామని, వీటిని వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు అన్నారు. శనివారం భీమవరం 32వ వార్డు బలుసుమూడి పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వృద్ధులకు మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సచివాలయాలు, పీహెచ్‌సీల్లో శిబిరాలు నిర్వహించి కంటి పరీక్షలు, ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తామన్నారు. 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 15 మందికి కళ్ల అద్దాలు, ఐదుగురికి శస్త్రచికిత్సలు చేయించాలని గుర్తించారు. వైద్యులు బి.రామకృష్ణ, ఎస్.కృష్ణదుర్గా పాల్గొన్నారు.



నాన్నంటే.. కొండంత ధైర్యం.. ఏదైనా సాధించగలమనే నమ్మకం.. పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు తాను కొవ్వొత్తిలా కరిగిపోతూ.. పెదాలపై చిరునవ్వును చిందిస్తాడు.. తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా.. బిడ్డల కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటాడు.. ప్రతి అడుగులోనూ పిల్లలను ప్రోత్సహిస్తూ అన్నీ తానై.. అంతటా తానై నడిపిస్తాడు.. అంతర్జాతీయ పితృదినోత్సవం సందర్భంగా స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచిన తండ్రుల వివరాలు మీ కోసం..
– భీమడోలు/పాలకొల్లు సెంట్రల్/కైకలూరు

నాన్నకు వందనం

నాన్న ప్రోత్సాహంతోనే..

పిల్లలను నిత్యం ప్రోత్సహిస్తూ, ఇద్దరు కుమారులను సివిల్స్‌లో టాపర్లుగా నిలపడంలో వెన్నుదన్నుగా నిలిచారు భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన విద్యుత్ శాఖ ఏఈ రాళ్లపల్లి భీమేశ్వరరావు. ఆయన బిడ్డలు జగత్‌సాయి 32, వసంతకుమార్ 157 ర్యాంకులతో ఆలిండియా స్థాయిలో సివిల్స్‌లో సత్తాచాటారు. జగత్‌సాయి ఉత్తరప్రదేశ్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. వసంతకుమార్ హైదరాబాద్‌లో ఐపీఎస్ శిక్షణలో ఉన్నారు. ఫాదర్స్‌డే సందర్భంగా జగత్‌సాయి


సివిల్స్ టాపర్స్ జగత్‌సాయి, వసంతకుమార్‌తో తల్లిదండ్రులు భీమేశ్వరరావు, అనసూయ

మాట్లాడుతూ అన్నదమ్ములిద్దరంగా ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామంటే తండ్రి భీమేశ్వరరావు ఇచ్చిన ప్రోత్సాహమే కారణమన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు నాన్న నిరంతరం శ్రమించేవారని, అదే తమలో స్ఫూర్తినింపిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవే తమను సివిల్స్ వైపు మళ్లించిందన్నారు. ఎక్కువ మంది ప్రజలకు సేవ చేయాలనే తలంపుతోనే తాము సివిల్స్ రాశామని.. పలుమార్లు విఫలమైనా నాన్న భుజం తట్టి ప్రోత్సహించడంతో లక్ష్యం సాధించామని చెప్పారు. తమ విజయానికి తండ్రి భీమేశ్వరరావే కారణమని చెబుతూ ఆయనకు ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

టీ అమ్ముతూ..

తాను ఎలా ఉన్నా పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేవాడు తండ్రి. తన ఆర్థిక స్థోమత సహకరించకున్నా బిడ్డల్లో చదువుపై ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహించి వారి కలలను సాకారం చేశారు పాలకొల్లుకు చెందిన వాకలపల్లి సూరిబాబు. గతంలో 15 ఏళ్లపాటు కాఫీ హోటల్‌లో పనిచేయగా.. పదేళ్ల నుంచి టీ అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఆయన కుమార్తెలు తేజశ్రీ, శ్యామల చదువుల కోసం నిరంతరం శ్రమించారు. పెద్ద కుమార్తె శ్యామల ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తిచేసి ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. చిన్న కుమార్తె తేజశ్రీ ఇంజనీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ కొలువు సాధించింది. తన తండ్రి కష్టంతోనే తాము ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామని, మా


తండ్రి సూరిబాబుతో తేజశ్రీ, శ్యామల

ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా మమ్మల్ని అన్నివిధాలా ప్రోత్సహించారని తేజశ్రీ ఆనందం వ్యక్తం చేస్తోంది.

తనయుడికి తోడుగా..

లేకలేక కలిగిన సంతానం. ఒక్కగానొక్క కుమారుడు. విధి వక్రించి మానసిక వైకల్యం వచ్చింది. అయినా తండ్రి ఏ మాత్రం దిగులు చెందలేదు. కుమారుడికి అన్నీ తానై అండగా నిలుస్తున్నారు కైకలూరు మండలం ఆటపాక శివారు అగ్రహారం గ్రామానికి చెందిన వేంపాటి శాస్త్రి. ఆయన కుమారుడు సాయి కార్తికేయ (14) మూగవాడు, మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. శాస్త్రి హోటల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ రోజూ కుమారుడిని కైకలూరులోని భవిత కేంద్రానికి తీసుకువస్తూ స్పీచ్‌థెరపీ ఇప్పిస్తున్నారు, విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. భవిత కేంద్రం ఐఈఆర్‌టీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ తనయుడి ఆరోగ్యం కోసం శాస్త్రి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.


కుమారుడిని భవిత కేంద్రానికి తీసుకెళుతున్న తండ్రి వేంపాటి శాస్త్రి

పక్కాగా నాడు-నేడు పనులు


కోపల్లెలో పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్

కాళ్ల: పాఠశాలల్లో నాడు-నేడు పనులను పక్కాగా చేపట్టాలని, బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కోపల్లె జెడ్పీ హైస్కూల్‌లో నాడు-నేడు పనులను శనివారం ఆమె తనిఖీ చేశారు. పనులను బాధ్యతతో చేపట్టాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారంలో రెండు రోజులపాటు పాఠశాలలను తనిఖీ చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించామన్నారు. అలాగే కోపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో స్టాకు రిజిస్టర్, స్టాకును కలెక్టర్ పరిశీలించారు. కోడిగుడ్డు సైజును స్వయంగా పరిశీలించి నిర్ణీత బరువు ఉన్నది లేనిదీ తూకం వేయించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల నాణ్యతను పరిశీలించారు. కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని సూచించారు.

ఎంఈఓ-2 నియామకానికి చర్యలు

ఏలూరు (టూటౌన్): కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అమరావతి వారి ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని మండల విద్యాశాఖాధికారి-2గా నియమించనున్నట్లు ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని ప్రభుత్వ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు, ఉమ్మడి పశ్చిమలో మండల విద్యాశాఖాధికారులుగా పనిచేస్తున్న వారంతా ఈనెల 18న మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని తెలిపారు.

పేదలకు ఉన్నత విద్యే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి, భీమవరం: పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థుల్లో స్ఫూర్తినింపేలా జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో జిల్లాస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తూ రూ.68 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు ప్రయత్నించారని విమర్శించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరింత శ్రద్ధతో పాఠ్యాంశాలు


జిల్లాస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

బోధించాలని, గతంలో విద్య అంటే కేరళ వైపు చూసేవారని, ఇప్పుడు ఏపీ వైపు చూస్తున్నారని అన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దమొత్తంలో ఖర్చు చేస్తోందని, గతంలో దాతల సాయం కోసం ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. అనంతరం జిల్లాలో అధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురికి రూ.50 వేలు రూ.30 వేలు, రూ.15 వేలు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఇంటర్‌లో గ్రూపుల వారీగా టాప్‌లో నిలిచిన ఆరుగురికి రూ.50 వేల చొప్పున నగదుతోపాటు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, ఆర్ఐఓ చంద్రశేఖరరావు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, కొట్టి కుటుంబరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మేడిది జాన్సన్, ఏఎస్ రాజు, గూడూరి ఉమాబాల, గాదిరాజు సుబ్బరాజు, గొలగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సబీనాకు మంత్రి ప్రోత్సాహం

టెన్త్ పరీక్షల్లో 586 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన తణుకు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని మహమ్మద్ సబీనాకు ప్రభుత్వం అందించిన రూ.65 వేల ప్రోత్సాహంతోపాటు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సొంతంగా మరో రూ.35 వేలు అందించి బ్యాంకులో డిపాజిట్ చేసేలా ఏర్పాటుచేశారు.

భక్తుల రద్దీ సాధారణం


చిన వెంకన్న క్షేత్ర అనివేటి మండపంలో కోలాట భజనలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వేసవి సెలవులు ముగియడంతో పాటు అమావాస్య ముందు రోజు కావడంతో ఆలయానికి స్వల్ప సంఖ్యలో భక్తులు వచ్చారు. దీంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు నామమాత్రపు భక్తులతో కనిపించాయి. మధ్యాహ్నం నుంచి భక్తుల తాకిడి మరింత తగ్గింది. ఆలయ అనివేటి మండపంలో తాడేపల్లిగూడెంకు చెందిన కృష్ణ వేణుగోపాల కోలాట బృంద సభ్యులు కోలాట భజనలు చేశారు.

రక్తదాతలు.. స్ఫూర్తి ప్రదాతలు

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు, కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకలను శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడాలని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ప్రమాద సమయంలో, తలసేమియా రోగులకు, తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న వారికి రక్తం అవసరం ఎక్కువగా ఉంటుందని, ప్రస్తుతం తగిన రక్త నిల్వలు అందుబాటులో లేవన్నారు. 25 శాతం మాత్రమే రక్తం అందుబాటులో ఉందన్నారు. ఈనెల 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని 130 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారన్నారు. ఈ ఏడాదిలో సుమారు 2,500 మంది రక్తదానం చేశారన్నారు. అనంతరం రక్తదానం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

చేసిన, రక్తదానం చేయడానికి ప్రేరేపించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులకు సంబంధించి 37 మందిని శాలువాతో సత్కరించి, మెమెంటోలను అందజేశారు. డీఆర్వో కె.కృష్ణవేణి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివరామ బద్రిరాజు, డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భానునాయక్, డీఐఓ దేవసుధ, రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విరాట పర్వ పారాయణం



శ్రీవారి ఆలయ ముఖ మండపంలో విరాట పర్వ పారాయణాన్ని నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో వర్షాలు సుభిక్షంగా కురవాలని కోరుతూ శ్రీవారి ఆలయంలో శనివారం విరాట పర్వ పారాయణాన్ని జరిపారు. ముందుగా పండితులు ఆలయ ముఖ మండపంలో ఆశీనులై వేద మంత్రోచ్ఛరణలతో ఈ పారాయణను నిర్వహించారు. దీంతో క్షేత్రం వేదఘోషలతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు జంగా వెంకట కృష్ణారెడ్డి తదితరులున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు శనివారం రూ.2,11,227లను విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన మద్యాహ్నపు మురళీ ప్రభాకరరావు రూ.1,11,111 లను ఆలయ కార్యాలయంలో జమ చేయగా, దాతకు ఆలయ ఇన్చార్జి ఈఓ ఎం.విజయరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే జంగారెడ్డిగూడెంకు చెందిన సత్తి సత్యన్నారాయణ రెడ్డి రూ.1,00,116 లను జమచేయగా, దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ
- పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘన సత్కారం



జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని సత్కరిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

ఏలూరు (మెట్రో): ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చైర్‌పర్సన్‌ను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ప్రప్రథమంగా తనకు జరిగిన సత్కారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆమె మాట్లాడారు. తాను పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే కారుణ్య నియామకాల ఫైల్‌పై తొలి సంతకం చేశానని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పదోన్నతులపై వెంటనే చర్య తీసుకుని 30 మందికి పదోన్నతులు ఇచ్చామన్నారు. ఉద్యోగులు తమ సమస్యలపై ప్రతివారం ఒక నిర్దిష్ట సమయంలో తనను కలిసేలా నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులకు ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నడూ లేనివిధంగా వరాలు కురిపించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. పారామెడికల్‌కు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులు పదివేల మందిని క్రమబద్ధీకరించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కిందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కాంట్రాక్టు ఉద్యోగుల గోడు పట్టించుకున్న నాథుడు లేడని, నేడు వైఎస్సార్ ప్రభుత్వం వారి చిరకాల పర్మినెంట్ ఉద్యోగం కోరికను నెరవేర్చిందన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన జీపీఎస్ పెన్షన్‌ను అమలు చేయడం కూడా ఒక గొప్ప నిర్ణయం అన్నారు. ఉద్యోగులు అడగకుండానే 12వ పే రివిజన్ కమిషన్‌ను (పీఆర్‌సీ) ఏర్పాటు చేశారని అన్నారు. నేడు ఉద్యోగులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగులతో కలిసి తాను సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. చైర్‌పర్సన్ పదవిని ఒక బాధ్యతగా భావిస్తున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఏపీఎన్జీవో సంఘం పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని లక్షలాది మందికి సేవ చేసే భాగ్యం చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి దక్కడం పూర్వ జన్మ సుకృతం అన్నారు. ముఖ్యఅతిథిలుగా జెడ్పీ వైస్ చైర్మన్ విజయబాబు, సీఈవో కేవీఎస్ఆర్ రవికుమార్ పాల్గొన్నారు. సభకు పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీధర్‌రాజు అధ్యక్షత వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం కార్యదర్శి నెరుసు రామారావు, మినిస్టీరియల్ సంఘం కార్యదర్శి సీహెచ్ గోపాలకృష్ణ ప్రసంగించారు. ఉద్యోగులు చైర్‌పర్సన్‌ను గజమాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

మళ్లీ మోసం చేయడానికి వస్తున్నారు

బాబు, పవన్‌పై మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే శ్రీనివాస్ ధ్వజం



భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ఫార్టీ ఇయర్స్ రాజకీయ చరిత్ర అంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వారాహి యాత్ర పేరుతో సినీ నటుడు పవన్ కల్యాణ్ ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ పేదలను సైతం ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియం విద్యను అమలు చేస్తుంటే మట్టిబుర్ర కలిగిన చంద్రబాబునాయుడు అడ్డుకున్నారని విమర్శించారు. అప్పట్లో తన అనుయాయుల ప్రైవేట్ పాఠశాలలు దెబ్బతినకుండా చంద్రబాబు ప్రైవేటు విద్యా వ్యవస్థను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేశాడని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమేగాక రూ.68 వేల కోట్లు విద్యాభివృద్ధికి ఖర్చు చేసినట్టు చెప్పారు. పవన్ కల్యాణ్ తన కొడుకు విద్యకు తాను ఖర్చు పెట్టుకుంటానని.. మీకెవరు ఖర్చు చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారని, పేద విద్యార్థులందరికీ అండగా జగన్ మామయ్య ఉంటాడని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల నుంచి విడదీయడం చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల ఎంతమాత్రం కాదని, ప్రజల హృదయాల్లో జగన్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారని మంత్రి చెప్పారు.

వారాహి యాత్రలో పవన్‌వి అన్నీ అబద్ధాలే..

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ వారాహి యాత్రలో పవన్ కల్యాణ్ సత్యదేవుని సాక్షిగా అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మొన్నటివరకు నాకు ముఖ్యమంత్రి పదవి ఎవరిస్తారన్న పవన్ నేడు ముఖ్యమంత్రి పదవిస్తే తీసుకుంటానంటున్నాడని, పవన్‌కు సీఎం పదవి చంద్రబాబు ఇస్తాడా లేక బీజేపీ ఇస్తుందా అని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ చాలా సందిగ్ధంలో ఉన్నారని, ఒకసారి పొత్తుతో ఎన్నికల్లో పోటీ అంటూ మరొకసారి పొత్తు లేదంటున్నాడని చెప్పారు. పవన్ కల్యాణ్ సినిమా డైలాగ్ మాదిరిగా ఆయన లెక్క ఏంటో తిక్క ఏంటో మేధావులకు కూడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రానున్న ఎన్నికల్లో 175 సీట్లలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

జగన్ వల్లే క్రైస్తవులకు సంక్షేమ ఫలాలు

సాక్షి, భీమవరం: ఎన్నికల మ్యానిఫెస్టోలో క్రైస్తవులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్కాగా అమలు చేసిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్ అన్నారు. శనివారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, పేదలకు సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. పాస్టర్లకు మొదటి విడతలోనే 6 వేల మందికి గౌరవవేతనం ఇవ్వగా, రెండో విడతలో మరో 3 వేల మందికి గౌరవవేతనం ఇవ్వనున్నారని వివరించారు. అంతేకాక వారికి జగనన్న కాలనీలలో ఇళ్లు ఇచ్చారన్నారు. క్రిస్టియన్ల కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని జాన్సన్ చెప్పారు. పాస్టర్లకు, క్రిస్టియన్లకు జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేస్తున్నా పచ్చ మీడియా కావాలనే జగన్ పాలనపై బురద చల్లుతున్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ఎన్నడూ పాస్టర్లను, క్రిస్టియన్లను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రతిపక్ష పార్టీలు, పచ్చమీడియా ఎంతగా దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని జాన్సన్ స్పష్టం చేశారు.



నారుమళ్లకు రెడీ

మండలంలో ఖరీఫ్ నారుమడుల పనులు ఊపందుకున్నాయి. దెందులూరు, అలుగులగూడెం, సానిగూడెం, గంగన్నగూడెం, గాలాయిగూడెం, గోపన్నపాలెం, జోగన్నపాలెం, శ్రీరామవరం, రామారావుగూడెం గ్రామాల్లో రైతాంగం పొలాలను దుక్కిదున్ని నారుమడులు వేయడానికి సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు ఇంకా ప్రారంభం కానప్పటికీ రైతులు నారుమడుల పనులను చకచకా చేస్తున్నారు. దెందులూరు మండల వ్యవసాయశాఖాధికారి గద్దె రమేష్ మెట్ట గ్రామాల్లో రైతులకు నారుమడులకు సంబంధించి పలు సూచనలు చేశారు.

– దెందులూరు

రైలు ఢీకొని యువకుడి మృతి



దాసరి సురేష్ మృతదేహం

ఆకివీడు: బహిర్భూమికి వెళ్లేందుకు రైలు పట్టాల వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా రామవరం గ్రామంలో ఉంటున్న దాసరి సురేష్ (30) తన తల్లి అనారోగ్యంగా ఉందని చూసేందుకు శుక్రవారం ఆకివీడు వచ్చాడు. శనివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లేందుకు రైలుపట్టాల వద్దకు వెళ్లగా లింగంపల్లి నుంచి నర్సాపూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేష్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి రైల్వే ఎస్సై పీటీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అరెస్టు.. మద్యం స్వాధీనం

సాక్షి, భీమవరం: పాలకోడేరు మండలం వేండ్రలో చేసిన దాడుల్లో అక్రమంగా మద్యం కలిగిన కడలి గణపతి అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 27 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ వీవీవీఎస్ఎన్ వర్మ శనివారం విలేకరులకు చెప్పారు. నిందితుడిని భీమవరం ఒకటో ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. దాడుల్లో తనతో పాటు ఎస్సైలు జి.సునీల్ కుమార్, బి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, డేవిడ్ రాజు, గణేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

మడికి వద్ద ప్రమాదంలో పశ్చిమ వాసి మృతి

మరో ముగ్గురికి గాయాలు



వేగేశ్న సుబ్రహ్మణ్యం రాజు (ఫైల్)

పాలకొల్లు అర్బన్: తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొల్లు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వేగేశ్న సుబ్రహ్మణ్యం రాజు (46) అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే ప్రమాదంలో వెంకటాపురానికి చెందిన బంధువు జి.వెంకట్రాజు, పాలకొల్లుకి చెందిన లాయర్ వెంకట్రామారెడ్డి, ఆరిమిల్లి రాజేశ్వరరావు గాయపడ్డారు. వీరు రాజమండ్రిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు సుబ్రహ్మణ్యంరాజుకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు రొయ్యల చెరువులు నిర్వహించుకుంటూ పాలకొల్లులో రొయ్యల మేత దుకాణం నడుపుకుంటున్నారు.

విదేశీయాత్ర ముగించుకుని స్వస్థలాలకు వస్తూ..

పది రోజుల క్రితం ఒక రొయ్యల కంపెనీ ఆహ్వానం మేరకు 40 మంది పాలకొల్లు పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వియత్నాం, కాంబోడియా దేశాలకు విహారయాత్రకు వెళ్లారు. శుక్రవారం వీరు తిరిగి విశాఖపట్టణం చేరుకున్నారు. వెంకటాపురం నుంచి కారు తీసుకురావాలని తన డ్రైవర్ వెంకట్రావును సుబ్రహ్మణ్యం రాజు కోరారు. స్వస్థలానికి ప్రయాణమయ్యారు. అప్పటివరకు డ్రైవర్ వెంకట్రావు కారు నడిపారు. అయితే అతను నిద్రపోతున్నట్లు గమనించి సుబ్రహ్మణ్యంరాజు డ్రైవింగ్ చేశారు. అయితే టాటా ఏస్ వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సుబ్రహ్మణ్యంరాజు గ్రామంలో ప్రజలందరితో మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. దీంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలియగానే స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. శనివారం రాత్రి సుబ్రహ్మణ్యంరాజు మృతదేహం గ్రామానికి చేరుకోగా, గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు.

ప్రజాస్వామ్య పటిష్టతకు దోహదం



ముంబైలో నేషనల్ లెజిస్లేచర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం : అఖిలభారత స్థాయిలో ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ లెజిస్లేచర్స్ సదస్సు ఎంతో అర్థవంతంగా, భారత ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టపరిచే దిశగా సాగిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మూడో రోజైన శనివారం సదస్సు ముగింపు సందర్భంగా ఆయన ముంబై నుంచి ఫోన్‌లో సదస్సు అనుభవాలను ‘సాక్షి’కి వివరించారు. జాతీయ స్థాయిలో సీనియర్ లెజిస్లేచర్లు ప్రజాస్వామ్యం బలోపేతం చేయడానికి తీసుకోవలసిన చర్యలపై అర్థవంతమైన వివరణలతో కూడిన ప్రసంగాలు తమలాంటి వారికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రజాస్వామ్య పరిపుష్టికి ఎన్నో విలువైన సూచనలు, సలహాలు ఈ సదస్సులో అందించారన్నారు. ఇలాంటి సదస్సులు ఏటా నిర్వహించడంవల్ల భారత ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందన్నారు. ఆయా రాష్ట్రాలలో చట్టసభలు అర్థవంతంగా నిర్వహించడానికి, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయడానికి, యువ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన విధానాలపై సీనియర్ పార్లమెంటేరియన్ల ప్రసంగాల ద్వారా ఎంతో విలువైన సమాచారాన్ని తెలుసుకోగలిగామన్నారు. భారత స్వాతంత్య్ర అమృతోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో నిర్వహించిన ఈ సదస్సులో అన్ని రాష్ట్రాలకు చెందిన రెండువేల మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారని, ఆయా రాష్ట్రాలలో పరిపాలన తీరు. అమలు జరుగుతున్న పథకాలు ఒకరితో ఒకరు పంచుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.

లోకేశ్‌కు మతి భ్రమించింది



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వచ్చే ఎన్నికలలో టీడీపీ అధికారంలోకి వస్తుందని, వైఎస్సార్ సీపీ నాయకులను గుర్తు పెట్టుకుని జైల్లో వేయిస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ యువగళంలో చెప్పడాన్ని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు తీవ్రంగా ఖండిస్తు, లోకేశ్‌కు మతి భ్రమించిందని విమర్శించారు. పట్టణంలోని కడకట్లలో మంగరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం టీడీపీ నాయకులను, రాష్ట్ర ప్రజలను సమానంగా చూస్తుంటే లోకేశ్ ఇలా మాట్లాడటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వారాహి యాత్రలో పవన్ సీఎం కావడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పడాన్ని తప్పుపట్టారు. 14 ఏళ్లలో బీజేపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ పార్టీలతో జతకట్టిన పవన్ తనకున్న ఓటు బ్యాంక్‌ను కోల్పోయారని, ఇప్పుడు కూడా ఒంటరిగా పోటీచేసే పరిస్థితి లేదన్నారు. టీడీపీతో కలిసి పవన్ పనిచేసేందుకు సిద్ధపడుతున్నారని, గెలిస్తే ముఖ్యమంత్రి ఎలా అవుతారని ప్రశ్నించారు. పవన్ ఒంటరిగా పోటీ చేసి, తన సత్తా చూపిస్తే సంతోషిస్తామన్నారు. అంతేగాని బీజేపీ, టీడీపీతో కలిసి పోటీ చేస్తే జన నికులు కూడా మద్దతు ఇచ్చే పరిస్థితులో లేరన్నారు. ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినప్పటికి వైఎస్సార్ సీపీ మరల అధికారంలోకి రావడం ఖాయమని, రాష్ట్రంలో అన్ని వర్గాలు వారికి, పార్టీల రహితంగా అందరికి సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అందించారన్నారు. నాయకులు ఏసురత్నం, ప్రేమ్‌కుమార్, బి.సునీల్, సందీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోమల నివారణకు పట్టణంలో ఫాగింగ్



పట్టణంలో రాత్రి సమయాల్లో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మున్సిపల్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని దోమల నివారణకు చర్యలు చేపట్టాలని చేసిన సూచనల మేరకు అధికారులు ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దోమల నివారణకు పట్టణంలో ఫాగింగ్ నిర్వహించకపోవడం కారణంగా దోమలు ఉధృతంగా ఉన్నాయి. ఎండలు మండుతున్నా రాత్రి సమయాల్లో ప్రజలకు దోమలు విజృంభిస్తున్నాయి. పాతూరు, మసీదు సెంటర్ తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం రాబోతున్న కారణంగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఫాగింగ్ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తామని చెప్పారు.

దిశ యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించాలి



మహిళా పోలీసులకు శిక్షణ ఇస్తున్న ఎస్సై బోనగిరి రాజు

తాడేపల్లిగూడెం అర్బన్ : దిశ యాప్ ఆవశ్యకతపై మహిళలకు అవగాహ కల్పించాలని సచివాలయ మహిళా పోలీసులకు పట్టణ ఎస్సై బోనగిరి రాజు తెలిపారు. స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్‌లో పట్టణంలోని సచివాలయ మహిళా పోలీసులకు శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ మహిళలు, కళాశాల విద్యార్థినుల ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌చేసుకొనేలా శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ఒక్కరి ఫోనులో దిశయాప్ ఉండేలా స్వయంగా మహిళా పోలీసులు విచారణ చేయాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదిశగా ప్రతీ ఒక్క రూ విధులు నిర్వహించాలని సూచనలు చేశారు.

భీమవరం సబ్ జైలు తనిఖీ



ముద్దాయిలతో మాట్లాడుతున్న జడ్జి పవన్‌కుమార్

సాక్షి, భీమవరం: పట్టణంలోని ప్రత్యేక కారాగారాన్ని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ముందుగా జైలులోని కిచెన్ రూమ్, కూరగాయలు, జైల్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి పవన్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీలు మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చునన్నారు. ముద్దాయిలు క్రమశిక్షణ, పరివర్తన, బాధ్యతతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్.సుధీర్, ప్యానల్ లాయర్ పి.అంబేద్కర్, కాశేశ్వర, జైలు పర్యవేక్షణాధికారి డి.వెంకటగిరి, జి.కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆషాడమాస జాతర

వీరవాసరం: మండలంలోని రాయికుదురులోని శ్రీ మావుళ్ళమ్మ , శ్రీ మహాలక్ష్మమ్మ ,శ్రీ పోతురాజు స్వామి వార్ల ఆషాడమాస జాతర మహోత్సవం శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల గరగోత్సవం కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దం భారతి, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మంతెన వరప్రసాద్, ఆలయ ఈఓ పులగం వేణుగోపాలరావు, బొళ్ల నాగేంద్ర కుమార్, ఏలూరి బాల వెంకట్రావు, గెద్దం భాస్కర్ రావు, పోలిశెట్టి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించండి

ఉండి: మండల వ్యాప్తంగా ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించాలని మండల ప్రత్యేకాధికారి ఎం రవికుమార్ తెలిపారు. శనివారం ఉండిలో పంచాయతీ, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఓటరు నమోదు ప్రక్రియపై ఇంటింటికీ సర్వే నిర్వహించాలన్నారు. ఈ సర్వే ద్వారా గ్రామం నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు, దేశాలకు వెళ్లిపోయిన వారిని, వివాహమై వెళ్లిపోయిన యువతులను గుర్తించి వారిని ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. అర్హులైన వారిని తప్పకుండా కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు

మంత్రి కారుమూరినాగేశ్వరరావు



అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, తదితరులు

అత్తిలి: పేద పిల్లలకు సైతం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యనందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శనివారం అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొమ్మర జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమాలకు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, అమ్మ ఒడి, మన బడినాడు–నేడు పాఠశాల అభివృద్ధి తదితర అభివృద్ధి పనులకు సంబంధించి అత్తిలిమండలానికి రూ. 17.97 కోట్లు నిధులు ఖర్చు చేశామన్నారు. ఈ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. విద్యను ఎవరూ దొంగలించలేనిదని, పంచే కొద్దీ మరింత పెరుగుతుందన్నారు. విద్యతోనే పేదరికం గెలిచి, మంచి అభివృద్ధి చెందవచ్చని ఆయన అన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యా అవకాశాలు పొందినట్లయితే ఆ కుటుంబ పరిస్థితుల రూపురేఖలు మారతాయి అన్న దూర దృష్టితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి ఎక్కువ నిధులు ఖర్చుపెట్టి ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని మంత్రి అన్నారు. సీఎం ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన ప్రవేశపెట్టి, ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తక్కువ కాదని నిరూపించారని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి జగనన్న ఆణిముత్యాలు అనే కార్యక్రమంతో మరో ముందడుగు వేసారని ఆయన వివరించారు. బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను విద్యార్థులకు అందించి ప్రభుత్వ స్కూళ్లల్లో డిజిటల్ విప్లవాన్ని తీసుకు వచ్చామని, ఇతర ఏ రాష్ట్రాల్లో ఇలాంటి కార్యక్రమం జరగలేదని, ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్లమాధ్యమం చాలాముఖ్యమని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మామయ్య ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధనకు అవకాశం కల్పించడం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. విద్యారంగంలో వివిధ పథకాలకు నాంది పలికి విద్యకు చక్కని ప్రోత్సాహం కల్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, మంతెన రామసీత, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు దారం శిరీషా, సుంకర నాగేశ్వరరావు. మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, ఉపసర్పంచ్ మన్యందానారావు, సొసైటీ అధ్యక్షుడు కునాధరాజు శ్రీహరిరాజు, మండలపార్టీ నాయకులు రంభ సూరిబాబు, గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, కాకర్ల విశాలాక్షి, శింగంశెట్టి శ్రీనివాస్, అడ్డాల వెంకట రత్నంబాబు, ఆకుల పండుస్వామి, ఆకుల చినబాబు, సంపద్‌రావు, ఎంఈవో శారదాజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు నగదు పురస్కారాలు పంపిణీ

అత్తిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పులు ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తున్నారని పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శనివారం అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చేతులు మీదుగా నగదు పురస్కారం, ప్రసంశాపత్రం, మెడల్స్‌ను అందజేశారు. అత్తిలి మండలం నుంచి పదోతరగతిలో 577 మార్కులు సాధించిన ఎస్ దుర్గకు ప్రభుత్వం నుంచి రూ 3వేలు, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు రూ. 5 వేలు, 568 మార్కులు సాధించిన బి కావ్యలక్ష్మికి రూ. 2 వేలు, 565 మార్కులు సాధించిన ఎం అనుకి వెయ్యిరూపాయలు ప్రైజ్‌మనీ అందజేసారు. వీటితో పాటు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తన సొంతంగా ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 2వేలు, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విద్యార్థులకు వెయ్యి రూపాయలు చొప్పున నగదు పురస్కారాన్ని అందజేశారు.

విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు అణిముత్యాలు దోహదం

తణుకు టౌన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి, స్ఫూర్తి పెరుగుతుందని తణుకు ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్ చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం పైడిపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నగదు పారితోషికాలతో సత్కరించారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



అత్తిలి అంగన్‌వాడీ కేంద్రంలో సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి కె మురళీకృష్ణ అన్నారు. అత్తిలి గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి సంపూర్ణ పోషణ కిట్లను పరిశీలించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డీబీ మాణిక్యాంబ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్‌క్లబ్ నేతృత్వంలో ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వైద్య బృందం వారిచే నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణ మూర్తి తెలిపారు. ఆధునిక వైద్య పరికరాలతో కంటి వైద్య పరీక్షలు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు, పేదలకు ఉచితంగా కళ్లజోడ్లు అందజేస్తారు. పట్టణ పరిసర ప్రాంతాలు వారు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవ ఎనలేనిది

విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి కారుమూరి



తణుకులో విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో నాణ్యమైన విద్యుత్‌ను కొనుగోలు చేసి విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం జరుగుతుందని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, పార్టీ నాయకుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా ఎండలు, గాల్పులు వీచి విద్యుత్ శాఖలో చాలా ఇబ్బందులు ఎదురైనప్పటికీ అన్ని సమస్యలను అధిగమించి విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులకే దక్కిందన్నారు. ఈ ఏడాది 1500 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుందని ముందుగా ఊహించినప్పటికీ ఏకంగా రెట్టింపుతో 3వేల మెగావాట్లకు విద్యుత్ వాడకం పెరిగిన నేపథ్యంలో రూ. 2700 కోట్లు వెచ్చించి విద్యుత్ కొనుగోలు చేసి విద్యుత్ సరఫరా చేశారని అన్నారు. ఇకపై కూడా అదే విధంగా ఎక్కడా హై, లో ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు, డీఈ ఎస్.వెంకటేశ్వరరావు, తణుకుఏడీఈ సీహెచ్ రామకృష్ణ, గణపవరం ఏడీఈ డి.రామకృష్ణలను మంత్రి కారుమూరి ఆదేశించారు. ముఖ్యంగా జగనన్న కాలనీల్లో ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యుత్ సౌకర్యం అభినందనీయమన్నారు. స్తంభాలు, విద్యుత్ లైన్‌ల ఏర్పాటు, మీటర్ల అందచేత వంటి సౌకర్యాలు భేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, కంచుమర్తి విశ్వేశ్వరరావు, కొమ్మోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలి



దువ్వలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న సైకాలజిస్ట్ శ్రీనివాసరావు

తణుకు టౌన్: పదో తరగతి విద్యార్థులు మొదటి నుంచి ఒత్తిడికి దూరంగా ఉంటూ ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా అభ్యసన ప్రారంభిస్తే పబ్లిక్ పరీక్షల సమయంలో మంచి మార్కులు సాధించవచ్చని సైకాలజిస్ట్ కోట శ్రీనివాసరావు చెప్పారు. శనివారం జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన మానసిక ఆరోగ్య (డీఎంహెచ్‌పీ) కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, మద్యపానం, దూమపానాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం నుంచి లభించే సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ స్వర్ణ కుమారి, హెచ్‌ఎం బీ ఆంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారం గ్రామంలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం పట్టణంలో విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తాడేపల్లిగూడెం సొసైటీ డైరెక్టర్ నీలపాల రామన్న అన్నారు. మండలంలోని ఎల్.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు కంచర్ల బాబా సత్యకుమార్, మైలవరపు తనూశ్రీసత్య, అడబాల పూజితలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా వారికి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద వరుసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. సొసైటీ డైరెక్టర్ నీలపాల రామన్న మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ప్రోత్సహకాలను అందిస్తుందన్నారు. ఈ ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.అనూరాధ, ప్రథమ సహాయకులు బాలకృష్ణ, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, జ్యోతికుమారి, సునీత లక్ష్మి, పద్మావతి, శారదా లక్ష్మి, శివగణేష్, సుభాని, శివనారాయణ్, చంద్రరావు, స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తపల్లి ప్రసాద్, విద్యాకమిటీ చైర్‌పర్సన్ బసివిరెడ్డి మంగతాయారు పాల్గొన్నారు.

కొమ్ముగూడెం విద్యార్థులకు ఆణిముత్యాలు

మండలంలోని కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు పెదపూడి పూజిత, అడ్డాల యశ శ్రీ దీప్తి, తమ్మిశెట్టి దేవ తేజస్వినిలకు శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో నగదు ప్రోత్సాహకాలు, మెడల్స్‌ను అందజేశారు. వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, సర్పంచ్ తాడేపల్లి బేబి, సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, పీసీ కమిటి చైర్మన్ కె.దుర్గ, ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు పురస్కారాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలకు పురస్కారాలు అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి వై.చరణ్‌తేజకు ప్రభుత్వం తరుపున రూ 3 వేలు నగదు, ద్వితీయ స్థానం సాధించిన ఐజేడీ ప్రకాశ్‌కు 2 వేలు నగదు, తృతీయ స్థానం సాధించిన టి.ప్రసన్నలక్ష్మికి రూ 1000 నగదుతో పాటు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌కూడా అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎన్.శివప్రసాద్, కార్యదర్శి పురుషోత్తం, వైఎస్ఆర్‌సీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, వట్టి బుజ్జి, తల్లిదండ్రుల కమిటీ సభ్యురాలు ఎం.దుర్గాభవాని, ఎన్‌సీసీ అధికారి కేవీ గణపతిరావు, ఎం.దుర్గాభావానీ, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ విజేత 'తణుకు'



తాడేపల్లిగూడెం మండలం క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ శనివారం జరిగాయి. ఫైనల్ మ్యాచ్‌లో తణుకు - మాధవరం టీమ్‌లు తలపడ్డాయి. తణకు 134 పరుగులు చేయగా, మాధవరం టీమ్ 85 పరుగులు చేసింది. దీంతో తణుకు టీమ్ విజేత కాగా, రన్నర్‌ప్‌గా మాధవరం టీమ్ నిలిచాయి. మూడవ విజేతగా లింగారాయుడిగూడెం, నాల్గవ విజేతగా చాగల్లు టీమ్‌లు నిలిచాయి. విన్నర్‌కు రూ.33,333లు, రన్నరప్‌కు రూ.22,222లు, మూడవ ప్రైజ్‌గా రూ.11,111లు, నాల్గవ బహుమతిగా రూ.5555లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జద్దు హరిబాబు, పంచాయతీ కార్యదర్శులు వీరబ్రహ్మం, కె.శ్రీనివాస రెడ్డి, నిర్వాహకులు గంధం బాబి, ప్రత్తి రాజబాబు, తారమట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఇరగవరం: మండలంలోని తణుకు ఐసీడీసీ ప్రాజెక్టు పరిధి ఇరగవరంలో గల రెండు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం జిల్లా డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి ఎస్‌టివి రాజేశ్వరరావు తనిఖీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు,గ్రుడ్లు, పాలు , రికార్డులను తనిఖీ చేశారు. ఫుడ్ స్టాక్ గురించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా పీపీ-1, పీపీ-2 బుక్స్‌ను తనిఖీ చేసి, అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ శ్రీనివాస్, మండల సూపర్ వైజర్లు ఎస్ కాంత కుమారి, సిహెచ్ నాగలక్ష్మీ, అంగన్‌వాడి కార్యకర్తలు తల్లులు పాల్గొన్నారు.

25న దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ



తణుకులో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: పట్టణంలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని తణుకులో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని శెట్టిబలిజ సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్ అన్నారు. తణుకు ఎన్టీఆర్ పార్కు ప్రాంత ఆవరణలో శ్రీరామా శెట్టిబలిజ సంఘం పాతవూరు ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ సాయంత్రం 4గంటలకు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతులమీదుగా ఈ విగ్రహావిష్కరణ జరుగుతుందని, ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ సంఘ కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీరామా శెట్టిబలిజ సంఘ పెద్దలు పిల్లి ముత్యాలు, కుడుపూడి చంద్రరావు, సానబోయిన రామచంద్రరావు, సానబోయిన రామకృష్ణ, చోడే గోపి, సానబోయిన శ్రీను, సానబోయిన దామోదరరావు, జోగి శ్రీను, కుడుపూడి వెంకటేశ్వరరావు, పిల్లి సూరిబాబు, శీలం త్రిమూర్తులు, పాల్గొన్నారు.

ఇంగ్లీషు బోధనలో మెలకువలు తెలుసుకోవాలి

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కళాశాల ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లీషు బోధన నూతన విద్యావిధానాన్ని అధ్యాపకులు తప్పనిసరిగా నేర్చుకోవాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డీగ్రి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు ఇంగ్లీషు విద్యాభోదన రెండవవిడత శిక్షణ శనివారం సాయంత్రం ముగించారు. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంగ్లీషు బోధనలో మెలకువలు అధ్యాపకులు తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, ఆధునిక సాంకేతిక విద్యావిధానం, ఆంగ్లమాధ్యమ బోధనపై ఈనెల 5 నుంచి 10 తేదీవరకు మొదటివిడత శిక్షణ ముగిసిందన్నారు. రెండో విడత 12 నుండి 17 వరకు జరిగిందన్నారు. ఈ సమావేశంలో రిసోర్స్‌సెంటర్ కో ఆర్డినేటర్లు, మాస్టర్ ట్రైనర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ఆకుతీగపాడులో గడపగడపకు మన ప్రభుత్వం

పెంటపాడు: మండలంలో ఆదివారం సాయంత్రం ఆకుతీగపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

27న గుంటూరులో ఏఐవైఎఫ్ యువజన సమ్మేళనం

సాక్షి, భీమవరం: రాష్ట్ర యువజన విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం ఈనెల 27వ తేది నుంచి నాలుగురోజులపాటు గుంటూరులో నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు చెప్పారు. భీమవరంలో శనివారం నిర్వహించిన అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరులో నిర్వహించే యువజన సమ్మేళనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన నిరంకుశ వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కొడవర్తి రమేష్, కోనాల భీమారావు, సుందర్, టి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సమస్యలు గుర్తించాలి

భీమవరం అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 24 నుంచి జరుగుతుందని అధికారులు, కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సమస్యలు గుర్తించాలని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఈ నెల 24 నుంచి జరగబోయే జగనన్న సురక్ష కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులకు, కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో దాసి రాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 24 ప్రారంభమై నెల రోజులు పాటు జూలై 24న ముగుస్తుందన్నారు. మండలంలో గ్రామాల్లో ఎంపీడీఓ వెంకటలక్ష్మి, తహసీల్దార్ వై. రవికుమార్‌ల పర్యవేక్షణలో రెండు బృందాలుగా అధికారులు, కార్యదర్శులు, వలంటీర్లు సమిష్టిగా ఇంటింటికి వెళ్లి బర్త్, డెత్, ఇన్‌కమ్, కుల ధ్రువీకరణ తదితర సమస్యలు ఉంటే గుర్తించి వెంటనే పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు.